
# ఆహారం వండే సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు.

సంస్థ పేరు: COVID-19 : భారతీయ వైజ్ఞానికుల ప్రతిస్పందన
ఓ స్వచ్ఛంద సమూహం

IndiSciCovid


https://indscicov.in/



Indian Scientists' Response to COVID-19

సాయంత్రం అయ్యింది, నేను అప్పటికే చాలా ఆకలితో ఉన్నాను. అప్పుడు నేను మా నాన్నతో ఇలా అన్నా, “నాన్నా, ఇవాళ మీ ప్రత్యేకమైన చికెన్ కూర చేస్తారా? అది కూడా మంచి మసాలాతో?” అమ్మ కూడా వెంటనే ఇలా మాట కలిపింది, “నేను కూడా ఇవాళ చాలా అలసిపోయానండి, ఇవాళ చికెన్ కూర మీరే చేసెయ్యండి.”

అప్పుడు నాన్న “అలాగే” అని, చేతులు కడుక్కోవడానికి వంటింట్లో సింకు దగ్గరకు వెళ్ళారు. ఆయనకు సమయం తెలియడానికి 20 నుంచి 1 వరకు లెక్కపెట్టడం మొదలుపెట్టాం, నేను, అమ్మ కలసి. ఇంక వంటకు ఉపక్రమిస్తూ నాన్న తనకు ఇష్టమైన రేడియో ప్రక్కన నేల మీద కూర్చున్నారు కూరలు తరగడానికి. సరిగ్గా అదే సమయానికి నాన్న స్నేహితుడు రమేష్ అంకుల్ వచ్చి నాన్న దగ్గరే కూర్చున్నారు. ఏదో వారపత్రికలు చదవటానికి తీసుకువచ్చారు ఆయన. కాసేపు మాట్లాడి వెళిపోయారు. ఆ తరువాత నాన్న ఆ ప్రదేశమంతా స్పాంజి మరియు సబ్బునీళ్ళతో శుభ్రం చేసారు. మళ్ళీ కూర్చుని బంగాళాదుంపలు, పచ్చిమిర్చి తరగడం మొదలుపెట్టారు. “ఇంకొంచెం ఎక్కువ తరగండి





పచ్చిమిర్చి," అన్నాను నేను. "చిట్టి తల్లీ, కొంచెం ఉల్లిపాయలు తరిగిపెడతావా నాకు?" అన్నారు నాన్న. "లేదు నాన్నా... అవి నన్ను బాగా ఏడిపిస్తాయి," అని ముఖం ముడిచేశా నేను. అది చూసి నాన్న తనే మూడు ఉల్లిపాయలు నీళ్ళలో నానబెట్టి తరగడం మొదలుపెట్టారు. ఇంతలో మా పక్కింటి సరళ ఆంటీ వచ్చి మా ఇంటి గోడ దగ్గర నిలుచుంది, మా అమ్మతో మట్లాడడానికి. ఆవిడ అమ్మతో ఇలా అంది, (co"మీకు తెలుసా మా చెల్లి వాళ్ళు ఈ పరిస్థితులకు భయపడి టమాటాలు, ఉల్లిపాయలు కూడా సబ్బునీళ్ళతో కడుక్కున్నారు. మొత్తం ఇంటిల్లిపాది సబ్బు కూడు తిన్నారు ఆఖరికి. ఏం చేస్తాం ఇలా ఉంటే పరిస్థితి." అది ఊహించుకుంటూనే పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నాను నేను.

"ఆ వైరస్ తినుబండారాలు, కూరగాయలు మీద పెరగదు తెలుసా? అయినా సరిగ్గా వండుకుని తింటాము కాబట్టి ఏమీ కాదు. అది బాక్టీరియా లాగ కాదు," అని అమ్మ చెప్పింది. "అవును అమ్మా, అది నాక్కూడా తెలుసు కానీ, ఉల్లిపాయలు బజారులో ఉన్నాయి, ఎంతో మంది వాటిని తాకి ఉంటారు కదా?" అని నేను అమ్మతో అన్నాను. అప్పుడు అమ్మ, "అవును తల్లీ, అందుకే నేను నిన్న మీ అన్నయ్య తెచ్చిన కూరగాయలు అన్నీ మామూలు నీళ్ళతో బాగా కడిగి లోపలికి



తెచ్చాను," అంది నవ్వుతూ. "తరువాత నేను ఇరవై సెకండ్లపాటు చేతులు సబ్బుతో కడుక్కున్నా," అన్నాం మేమిద్దరం ముక్తకంఠంతో.

అప్పుడు సరళ ఆంటీ అలా నాన్న ఏం చేస్తున్నారో చూస్తూ ఇలా అంది, "ఏంటి చికెన్ కూర చేస్తున్నారా? కాని నేను వాట్సాప్ లో చదివా ఈ వైరస్ మొదట జంతువులనుండి వచ్చిందంట తెలుసా? ఇప్పుడు మరి మీరు చికెన్ పర్వాలేదా?". "ఏం పర్వాలేదండి" అని వెంటనే అన్నారు నాన్న. "ఈ వైరస్ మనుషుల నుండి మనుషులకు మాత్రమే సంక్రమిస్తుంది. కాబట్టి చికెన్ వల్ల ఏం భయం లేదులెండి. డాక్టర్లు కూడా చెప్పారు ఇది," అని అంటూ నాన్న మాటలు కొనసాగించబోయారు. నా అదృష్టం కొద్దీ వాళ్ళ అమ్మాయి పిలవడంతో ఆవిడ వాళ్ళింట్లోకి వెళ్ళింది. హమ్మయ్య! అని అనుకున్నా నేను ఆవిడ మాటలు వినలేక.

అప్పుడే మా అన్నయ్య శేఖర్ షాపునుండి తిరిగి వచ్చాడు. అమ్మ బియ్యం, కందిపప్పు, నా కోసం మంచి బిస్కెట్లు తెమ్మని పంపింది వాడిని. ఇప్పుడు వాడు ఇంటి ముందు ఏం చేయాలా అని అయోమయంగా నిలబడ్డాడు. అప్పుడు అమ్మ నవ్వుతూ, "ఒక్క నిమిషం ఉండరా అలా," అని వంటగదిలోకి వెళ్ళి మూడు డబ్బాలు తీసుకువచ్చింది. ఆ డబ్బాలు చూపించి ఇందులో ఇప్పుడు ఆ ప్లాస్టిక్ కవర్లు కత్తిరించి ఆ డబ్బాలకు తగలకుండా బియ్యం, కందిపప్పు, బిస్కెట్లు వెయ్యమని చెప్పింది. "క్రిందపడకుండా వెయ్యలేదో తంతాను రేయ్," అని కూడా చెప్పింది అమ్మ. అమ్మ చెప్పినవి శ్రద్ధగా చేస్తున్న మా అన్నయ్యను చూసి నవ్వుతూ ఎగతాళి చేసాను నేను. మొత్తానికి డబ్బాలకు తగలకుండా అన్నీ




డబ్బాలలో వేసేసాడు మా అన్నయ్య. “అయిపోయింది!” అని అన్నాడు ఏదో సాధించాననే ధోరణిలో. అప్పుడప్పుడు వాడు వేసే వేషాలు చూసి మేమందరం నవ్వుకుంటాము. ఇవాళ ఉదయం సరళ ఆంటీ ఇచ్చిన బంగాళాదుంపల కూర కూడా అమ్మ ఇలాగే గిన్నెలో వేసింది.

“ఇప్పుడు ఈ ప్లాస్టిక్ కవర్లు ఏం చేయను అమ్మా,” అన్నాడు మా అన్నయ్య. “అవి అక్కడ ఉన్న చెత్తకుండీలో పడేసి చేతులు కడుక్కుని లోపలికిరా,” అని అంది అమ్మ. “చేతులను ఇరవై సెకండ్లపాటు కడుక్కుని రావాలి,” అని బిగ్గరగా అరచి చెప్పాను నేను వాడికి. అలానే చెప్పింది చేసి లోపలికి వచ్చి బట్టలు మార్చుకోవడానికి వెళ్ళాడు.

ఈ లోపు మా నాన్న తరిగే పని అయిపోయి వంటగదిలోకి వెళ్ళారు. ఇవాళ అంతకుముందే అక్కడ ఉన్న గిన్నెలు, చెంచాలు పొయ్యితో సహా అన్నీ డిటర్జెంట్, నీళ్ళతో కడిగేశారు నాన్న. ఇక వంట మొదలుపెట్టారు. వంటింటినుంచి మంచి మసాలా వాసన ఘుమఘుమలు రావడం మొదలుపెట్టాయి. అలా వంటచేస్తూ ఇలా అన్నారు నాన్న, “మన పక్కింటి రామారావుగారి గురించి విన్నావా? గతవారం ఆయన బాగా జలుబు, దగ్గుతో బాధపడ్డారట. కాస్త జ్వరం కూడా వచ్చి చాలా ఇబ్బంది అయిందట.”

“అవునా! వాళ్ళ కుటుంబం చాలా భయపడి ఉంటుంది కదా. మనం వెళ్ళి వాళ్ళని పలకరిద్దామా?” అని అడిగాడు మా అన్నయ్య శేఖర్. దానికి మా అమ్మ తల అడ్డంగా ఊపుతూ, “వద్దు నాన్న, వాళ్ళు ఇప్పుడు గృహ నిర్బంధంలో ఉంటారు. ఇప్పుడు కలవవద్దు,” అని మా అన్నయ్యకు చెప్పింది. ఆయన వాళ్ళ కుటుంబసభ్యులతో కలసి ఎలా తింటారా అని ఆలోచిస్తూ నేను ఇలా అమ్మని అడిగా, “అమ్మా, కాస్త చికెన్ కూర ఆయనకు కూడా ఇద్దామా?”. దానికి మా అమ్మ “అలాగే తల్లీ, కాని మనం, వాళ్ళు కూడా, చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆయన్ని తన గదిలోనే ఉంచాలి. ఆయనకి ఎవరో ఒకరు వచ్చి భోజనం అందించాలి. తిన్న తరువాత ఆ పళ్ళెం కూడా బాగా కడిగి శుభ్రంచేయాలి.” అని



అమ్మ నాకు చెప్పింది. "రామారావు అంకుల్ తొందరగా కోలుకుంటే బాగుణ్ణు. నాతోపాటు గాలిపటం ఎగురేస్తాను అని అంకుల్ అన్నారు అప్పుడు," అని మా అమ్మ ఒడిలో పడుకుని చెప్పాను నేను.

ఇంతలో, "చికెన్ కూర తయారయిది, రండి ఓ పట్టుపడదాం," అని చెప్పారు నాన్న. మా అందరి చేతులు సబ్బుతో కడిగించి ఎవరి కంచాలు వారు తెచ్చుకోమన్నారు. వేడి వేడిగా మా అందరి కంచాలలో చికెన్ కూర వడ్డించారు నాన్న. "మీకు పెట్టుకోలేదు, మీరు తినరా," అని అన్నా నేను. "ఒక్క నిమిషం," అంటూ తల దురదపెడుతుంటే గోక్కుంటూ, "అరగంటనుండీ దురదపెడుతున్నా ఈ వంట గోలలో పడి అవ్వలేదమ్మా గోక్కోవడం," అని సరదాగా నవ్వుతూ అన్నారు. అందరం హాయిగా నవ్వుకున్నాం. నాన్న కూడా వెళ్ళి చేతులు కడుక్కుని వచ్చారు. మేమందరం దూరం దూరంగా కూర్చొని సామాజిక దూరం పాటిస్తూ శుభ్రంగా నాన్న చేసిన అద్భుతమైన చికెన్ కూర కడుపునిండా తిన్నాం.

ఈ కథలు విలక్షణమైన దృశ్యాలను చిత్రీకరించడానికి మరియు మేము అందించే సమాచారాన్ని సందర్భోచితంగా చేయడానికి ఉద్దేశించబడినవి. దీని ద్వారా, ఇక్కడి విషయాన్ని సులభంగా నివేదించడం జరిగింది. శాస్త్రీయ ఖచ్చితత్వం కొరకు, దయచేసి వెబ్‌సైట్ లోని సంబంధిత ప్రతులను చూడగలరు.

